నేటి నుంచి కార్తీక మాసం



కరీంనగర్ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విశిష్టతను సంతరించుకున్న పవిత్ర కార్తీక మాసం శనివారంతో ప్రారంభం కానుంది. నవంబరు 15న కార్తీక పౌర్ణమి పర్వదినం జరుపుకోనున్నారు. ఈ మాసంలో కార్తీక దీపాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. నోములు, వ్రతాలు దానధర్మాలకు నెలవైన ఈ మాసంలో శివకేశవులను పూజించడం ద్వారా విశేష ఫలితాలు కలుగుతాయని పురాణాలు చెబుతున్నాయి.

గురుకులాల్లో వసతుల కల్పనకు చర్యలు

- గ్రీన్ ఛానల్ ద్వారా బిల్లులు చెల్లించేందుకు త్వరలో నిర్ణయం
- మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లోక్‌సభ, రాజ్య సభ సభ్యులు గురుకుల హాస్టల్‌లను సందర్శించాలని దీపావళి పండుగ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డైట్, కాస్మొటిక్ చార్జీ లు పెంచిన సందర్భంగా శుక్రవారం కరీంనగర్, శర్మనగర్ మహాత్మా జ్యోతిబాఫూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలలో జరిగిన దీపావళి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచిందన్నారు. త్వరలో ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్స్, క్రీడా మైదా నాలు వస్తున్న తరుణంలో జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో విద్యార్థులు రాణించేలా స్పోర్ట్స్ టీచర్స్ తీర్చిదిద్దాలని కోరారు. ప్రైవేట్ బిల్డింగ్స్‌లో నడిచే గురుకుల విద్యాలయాలకు అద్దెల చెల్లింపు కోసం 100 కోట్లు నిధులు విడుదల చేశామని అన్నారు. త్వరలో మిగిలిన నిధులు విడు దల చేస్తామని అన్నారు. కాంట్రాక్టర్లు నాణ్యమైన వస్తువులు, ఆహార పదార్థాలు అందించాలని కోరారు. సరఫరాదారులకు జాప్యం లేకుండా గ్రీన్ ఛానల్ ద్వారా బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకోనుందని స్పష్టం చేశారు. 1020 భవనాల్లో 320 మాత్రమే ప్రభుత్వ భవనాలున్నాయని, మిగిలినవి కిరాయితో నడుస్తు న్నాయని అన్నారు. విద్యార్థులకు 2 జతల నైట్ డ్రెస్‌లు అందిస్తా మన్నారు. గురుకులాల్లో సోలార్ ఫీడర్లు అమరుస్తామన్నారు. విద్యా ర్థులు ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులతో కలసి టపాసులు పేలుస్తూ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, బీసీ వెల్ఫేర్ స్కూల్స్ ఆర్‌సీఓ అంజలి, డీసీవో సరిత, ప్రిన్సిపల్ కట్ట వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మహాశక్తి ఆలయంలో వ్యక్తిగత భద్రతా సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ జవాన్‌లతో కలసి బాణాసంచా కాలుస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్



కుటుంబసభ్యులతో కలసి దీపావళి వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

అంబరాన్నంటిన దీపావళి సంబరాలు



సమాధుల్లో దీపావళి సంబరాలు జరుపుకుంటున్న ఓ సామాజిక వర్గ ప్రజలు

- ధనలక్ష్మీ పూజలు, నోములు, వ్రతాలు
- మార్మోగిన బాణాసంచా మోతలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 1: జిల్లా వ్యాప్తంగా గురువారం దీపావళి వేడుకలు అంబరాన్నంటాయి. గురువారం మధ్యాహ్నం తర్వాత అమావాస్య రావడంతో సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు దీపావళి పూజలు జరుపుకున్నారు. శుక్రవారం స్వాతీ నక్షత్రంతో కూడిన అమావాస్య ఉదయ వ్యాప్తికి ఉండటంతో దీపావళి పూజలతో పాటు కేదారీశ్వర, సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. బాణాసంచా వెలుగులు, వ్రతాలు, లక్ష్మీ పూజలతో సందడి నెలకొంది. దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. నగర సర్వతోముఖా భివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని అన్నారు. భగత్‌నగర్‌లో

మిగతా 8వ పేజీలో... ..

భారతమాత సేవలో తరిద్దాం...

- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

భారతమాత సేవకు పునరంకితం అయి తరించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. దీపావళి వేడుకల్లో భాగంగా చైతన్యపురి మహాశక్తి దేవాలయంలో అమ్మవార్లకు చేసిన ప్రత్యేక అలంకార పూజల్లో పాల్గొన్నారు. అనంతరం దీపాలు వెలిగించి తన వ్యక్తిగత భద్రతా సిబ్బందితో కలసి టపాసులు కాల్చారు. స్వీట్లు తినిపించారు. ఆయన మాట్లాడుతూ స్వార్థం, కల్మషం, అహంకారం వీడి మంచి ఉత్తమ సమాజం కోసం ప్రయత్నం చేద్దామని పిలుపునిచ్చారు.

● మంత్రి పొన్నం నివాసంలో..

మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో జరిగిన వేడుకల్లో మంత్రితో పాటు కుటుంబ సభ్యులు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. మంత్రి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం జరిగిన కేదీశ్వర నోముల్లో మంత్రి, ఆయన సోదర సోదరీమణులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

● సమాధుల దగ్గర వేడుకలు

నగరంలోని బీట్ మార్కెట్ ఇరుపక్కల, సవరన్ స్ట్రీట్, ఆదర్శనగర్ ప్రాంతాల్లో గల సమాధుల్లో ప్రజలు గతించిన పెద్దలకు పూజలు నిర్వహించి బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీట్ మార్కెట్ హిందూ శ్మశాన వాటికలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ మెండి శ్రీలతా చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఇందుర్తిలో ధాన్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలి

● అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

చిగురుమామిడి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ అన్నారు. మండలంలోని సుందరగిరి, బొమ్మనపల్లి, ఇందుర్తి, చిగురుమామిడి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను శుక్రవారం అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ధాన్యం దళారులకు తక్కువ ధరకు విక్రయించి రైతులు మోస పోవద్దని అన్నారు. ప్రతీ రైతు ధాన్యం తీసుకొచ్చే సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. సుందరగిరి, ఇందుర్తి గ్రామాలకు చెందిన రైతులు తాము ధాన్యాన్ని ప్యాడీ క్లినింగ్ చేయబోమని కలెక్టర్‌కు తేల్చి చెప్పారు. కేంద్రాల్లో ధాన్యాం కంటా వేయడంలో సిబ్బంది తీవ్ర జాప్యం చేయడం వల్ల చాలా మంది రైతులు మిల్లర్లకు విక్రయించారని పలువురు తెలిపారు. స్పందించిన అదనపు కలెక్టర్ రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కొనుగోళ్ల సైతం వేగవంతం చేయాలన్నారు. కాంటా వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని చెప్పారు. అందుకు తగిన విధంగా వాహనాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో తహసీల్దార్ ముద్దసాని రమేశ్, ఎంపీడీవో యండి ఖాజామొయినోద్దీన్, ఐకేపీ ఏపీఎం మట్టెల సంపత్‌కుమార్, ఆర్‌ఐ అరుణ్‌కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసి కమిషన్ చైర్మన్ నిరంజన్

కులాలవారీగా లెక్కతేలితేనే సమన్యాయం

- సర్వేకు సహకరించాలి
- తప్పుడు సమాచారమిస్తే కేసులు
- సమగ్ర సర్వే ఏమైందో దేవుడికే తెలియదు...
- చిత్తశుద్ధితో చేస్తున్న సర్వేతో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నా
- బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

◆ కరీంనగర్ టౌన్ / సుభాష్‌నగర్

7

కారుణ్య నియామకాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..



టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌కు వినతిపత్రం అందచేస్తున్న అభ్యర్థులు

సుభాష్‌నగర్, నవంబరు 1 (ఆంధ్ర జ్యోతి): జిల్లా పరిషత్ కారుణ్య నియామక అభ్యర్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. శుక్రవారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కారుణ్య నియామకాల అభ్యర్థులు మారం జగదీశ్వర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అన్యాయం జరిగిందని, సత్వరమే న్యాయం జరిగేలా సమస్యలను మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్‌సింగ్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, నోముల నర్సింహారెడ్డి, భాగ్య, సతీష్, రఘురాంరెడ్డి, సతీష్, విశాల్, నచ్చికేత్, పృథ్వీరాజ్, అజిత్, షాహెబాజ్, సౌజన్య పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



కులగణనపై ఆరాతీస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

గంగాధర, నవంబరు 1 (ఆంధ్ర జ్యోతి): కుల గణనలో ఒక్క కుటుంబాన్ని వదిలేయకుండా సర్వే పకడ్బందీగా నిర్వహిం చాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. గంగాధర మండలం మధురానగర్ గ్రామ పంచాయతీని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 కుల గణన సర్వేలో ఇచ్చిన సమయం ప్రకారం ఏ ఒక్క కుటుం బాన్ని వదలకుండా సర్వే చేయాలన్నారు. సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ అంశాలను నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో రాము, ఎంపీ వో జనార్దన్‌రెడ్డి, కార్యదర్శి లచ్చయ్య, రాజసులోచన సిబ్బంది పాల్గొన్నారు. రామడుగు: గ్రామంలోని ప్రతీ కుటుంబంలోని సభ్యులను గుర్తిం చి నమోదు చేయాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి అన్నారు. మండలంలోని వెదిరలో కుల గణనలో భాగంగా నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్స్ చేపడుతున్న సర్వే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటలక్ష్మీ, కార్యదర్శి మల్లికార్జున్, కారోబార్ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి యోగాసన పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 1: జిల్లా యువజన క్రీడాశాఖ, జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లాస్థాయి ఆహ్వానిత యోగాసన పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడాశాఖాధికారి వి శ్రీనివాస్ ఒక ప్రకటలో తెలిపారు. 8 సంవత్సరాల పైబడిన వారి నుంచి వయో వృద్ధులు వరకు ఈ యోగాసనా పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు ఉదయం 9 గంటలకు జనన ధ్రువీకరణ పత్రాలతో హజరు కావాలని సూచించారు.

ఇందిరాగాంధీ సేవలు అభినందనీయం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- జిల్లా వ్యాప్తంగా ఘన నివాళి
- హాజరైన కాంగ్రెస్ నాయకులు

◆ కరీంనగర్ అర్బన్

8

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేధం పొడిగింపు

కరీంనగర్ క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సాధారణ పౌరులు, ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేదాజ్ఞలను పొడిగించామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ కమిషనర్ అభిషేక్ మొహంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిషేదాజ్ఞలు ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో డీజే సౌండ్‌ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేదాజ్ఞలను పొడగించామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ కమిషనర్ అభిషేక్ మొహంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిషేదాజ్ఞలు ఉల్లఘించే వారిపై ఐపీసీ 188, హైదరాబాద్ నగర పోలీసు చట్టం, పసలి నిబంధనలనుసరించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

డ్రోన్‌ల వినియోగంపై నిషేధాజ్ఞలు

కరీంనగర్ క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో భద్రత కారణాల దృష్ట్యా పారాగ్లైడర్స్, రిమోట్ కంట్రోల్ డ్రోన్స్, రిమోట్ కంట్రోల్ మైక్రోలైట్ ఎయిర్ క్రాఫ్టుల వినియోగాన్ని నిషేధించామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ కమిషనర్ అభిషేక్ మొహంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిషేదాజ్ఞలు ఈ నెల 30వ తేదీ వరకు అమలుల్లో ఉంటాయని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఐపీసీ సెక్షన్ 188 ప్రకారం చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్‌కమిషనర్ కమిషనర్ అభిషేక్ మొహంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 30 వరకు అమలులో ఉంటాయని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

గణేష్‌నగర్, నవంబరు 1(ఆంధ్ర జ్యోతి): జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు దరఖా స్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కలువకుంట రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26వ బ్యాచ్‌లో అడ్మిషనర్ల కోసం నవంబరు 25వ తేదీలోగా తమ దరఖాస్తులను తెలుగు విభాగంలో కన్వీనర్ డాక్టర్ బూర్ల చంద్రశేఖర్ అందజేయాలని సూచించారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరికి గాయాలు

వీణవంక నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్భాపూర్ గ్రామ శివారులో కట్టెల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో దొడ్డె మధుకు తీవ్ర గాయాలయ్యాయి. జమ్మికుంట మండలం పెద్దంపల్లి గ్రామానికి చెందిన మధు బైక్‌పై వీణవంక వైపు వెళ్తున్నాడు. ఆ సమయంలో కట్టెల లోడుతో వస్తున్న ట్రాక్టర్ (ఏపీ15టీ 5297) బైక్‌ను ఢీకొట్టింది. కింద పడిన మధుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వృద్ధుడి ఆత్మహత్య

రామగుడు, నవంబరు 1(ఆంధ్ర జ్యోతి): ఓ వైపు వృద్ధాప్యం, మరోవైపు అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది ఓ వృద్ధుడు కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని రంగసాయిపల్లి గ్రామానికి చెందిన పెద్దిగారి ఎల్లయ్య(85) మధుమేహంతో పాటు మానసిక సమస్యలతో బాధపడు తున్నాడు. ఈ క్రమంలోనే గురువారం దీపావళి పండుగ వేళ ఎల్లయ్య తన బైక్‌పై ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. రాత్రి అయినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. లక్ష్మీపూర్ శివారులోని గ్రావిటీ కెనాల్ బ్రిడ్జి వద్ద ఎల్లయ్య వాహనం, చెప్పులు కనిపించాయి. దీంతో కాలువలో గాలించగా మృతదేహం లభ్యమైంది. అనారోగ్య సమస్యల మూలంగా తన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడని ఎల్లయ్య కుమారుడు బీరయ్య ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

> పెద్దపల్లి జిల్లా మంథని బ్రాహ్మణుల వంటకాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. బూడిద గుమ్మడికాయ బురడా, మోతిచూర లడ్డూ, ఆలుబాత్, చల్ల పులుసు, ఉప్పిడి పిండి, బిల్లావక్క, సొజ్జబూరెలు, పునుకులు, దోసకాయ వడియం, పంచామృతం, దోసకాయ బరడా, దోసకాయ పచ్చడి, పొట్లకాయపచ్చడి, గారెబోండలు, వడలు, పులిహోర, చక్కిలాలు, అరిసెలు, చల్లా పిరువ కాయలు, ముద్దపప్పుకూర, పెసరిపిండి ముద్దలు మంథని వంటకాల్లో ప్రత్యేకమైనవి. ఎంతో రుచిగా ఘుమఘుమలాడే బూడిద గుమ్మడికాయ బరడాకు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు సైతం ఫిదా అయ్యారంటే అతిశయోక్తి కాదు.

మంథని రుచులు అదుర్స్


బూడిద గుమ్మడికాయ బరడా కూర
గుమ్మడికాయ బరడా కూర
ఆలుబాత్ రైస్


మోతిచూర లడ్డు

- బూడిద గుమ్మడికాయ బరడాకు మాజీ ప్రధాని పీవీ సైతం ఫిదా..
- మంథని వంటకాలకు ప్రత్యేక గుర్తింపు

మంథని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సహజంగా బూడిద గుమ్మడికాయను దిష్టి తగలకుండా ఇంటి ముందు గుమ్మాలకు వేలాడదీస్తారు. నూతన గృహ ప్రవేశాలు, వాహన పూజలకు సైతం వినియోగిస్తారు. కానీ ఇదే బూడిద గుమ్మడికాయతో "గుమ్మడికాయ బరడా"గా పిలిచే వంటకాన్ని తయారు చేయడం పెద్దపల్లి జిల్లా మంథని బ్రాహ్మణ కుటుంబాల ప్రత్యేకత. వంటల్లో ఒక్కో ప్రాంతానికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. అలాగే మంథని ప్రాంత వంటకాలు సైతం ప్రత్యేక గుర్తింపు ఉంది. బూడిద గుమ్మడికాయ బరడాతో పాటు మోతిచూర లడ్డూ, ఆలుబాత్, చల్ల పులుసు, ఉప్పిడి పిండి, బిల్లా వక్క, సొజ్జబూరెలు, పునుకులు, బోడకాకర, పాలకూర, దోసకా య వడియం, పంచామృతం, దోసకాయ బరడా, దోసకాయ పచ్చడి, చింతపండు పులుసు, ఆవకాయ, పొట్లకాయ పచ్చడి, గారెబోండాలు, వడలు, పులిహోర, చక్కిలాలు, అరిసెలు, చల్లపిరువకాయలు, ముద్దపప్పుకూర, పెసరి పిండి ముద్దలు మంథని వంటకాల్లో ప్రత్యేకమైనవి.

మంథనిలోని బ్రాహ్మణ కుటుం బాలు బూడిద గుమ్మడికాయతో ఘుమఘుమలాడే బరడా వంటకాన్ని తయారు చేసుకొని తినడం సంప్రదాయంగా వస్తోంది. వృత్తి, వ్యాపార రీత్యా దేశవిదేశాల్లో స్థిరపడ్డ మంథని బ్రాహ్మణ కుటుంబాలు బూడిద గుమ్మడికాయ బరడా వంటకాన్ని ఇప్పటికీ ఆరగిస్తున్నారంటే ఆ వంటకానికి ఉన్న ప్రత్యేకత అర్థం చేసుకోవచ్చు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆచార్యులు, వేద పండితులు, పీఠాధిపతులను మంథనికి ఆహ్వానిస్తే.. "బూడిద గుమ్మడికాయ బరడా భోజనం పెడతారా.." అంటూ నవ్వుతూ ప్రశ్నించేవారట.

- ప్రముఖులు సైతం ఫిదా..

మంథని నుంచి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి ఎమ్మెల్యేగా, ముఖ్యమంత్రిగా, ప్రధానిగా సేవలందించిన స్వర్గీయ పీవీ నర్సింహారావు బూడిద గుమ్మడికాయ బరడాను అత్యంత ఇష్టంగా తినేవారు. పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో మంథనికి చెందిన బ్రాహ్మణులు బరడా వంటకం తయారీ కోసం ఢిల్లీలో ఉండేవారంటే అతిశయోక్తి కాదు. మంథని మాజీ ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ శాసన సభ మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీపాదరావుకు సైతం బూడిద గుమ్మడికాయ బురడా అంటే చాలా ఇష్టం. అంతేకాదు మంథనిలోని చాలా మంది ఇళ్లలో వారంలో ఏదో ఒక రోజు తప్పనిసరిగా బూడిద గుమ్మడికాయ బురడాను వండుకొని తింటారు. అలాగే వివాహాలు, వడుగు, గృహప్రవేశాలు, నోములు, వ్రతాలతో పాటు అన్నదాన కార్యక్రమాల్లోనూ బూడిద గుమ్మడికాయ బరడా కూర వడ్డించడం విశేషం.


వంటలు చేస్తున్న మంథనికి చెందిన రాజు


సొజ్జ బూరెలు

రాష్ట్ర స్థాయి ఉషు పోటీలకు ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గంభీరావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) ఎస్‌జీఎఫ్ అండర్-17,-19 రాష్ట్రస్థాయి ఉషు పోటీలకు గంభీరావుపేట కేజీబీవీ క్రీడాకారులు ఎంపికయ్యారు. అండర్-17 40 కేజీల విభాగంలో మౌనిక, 44 కేజీ విభాగంలో దీపిక, 48 కేజీ విభాగంలో సోనీ, 56 కేజీ విభాగంలో చరణ్య ఉమ్మడి జిల్లా స్థాయిలో బంగారు పతకాలు సాధించారు. 48 కేజీల విభాగంలో అస్మిత కాంస్య, 52 కేజీ విభాగంలో వైష్ణవి వెండి పతకాలు సాధించారు. అండర్-19లో 60 కేజీ విభాగంలో ఇందు స్వర్ణం సాధించినట్లు పీఈటీ స్వప్నరెడ్డి తెలిపారు. వీరంతా శనివారం మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఉషు పోటీల్లో పాల్గొననున్నారు.

ఆర్టీసీ రీజనల్ అకౌంట్స్ ఆఫీసర్‌గా మనోహర్‌రెడ్డి

భగత్‌నగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రీజియన్ అకౌంట్స్ ఆఫీసర్‌గా జి.మనోహర్‌రెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేసిన చీకోటి వెంకటేశ్వర్లు పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో మనోహర్‌రెడ్డి నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన మనోహర్‌రెడ్డిని ఆర్టీసీ అధికారులు బి మొగిళి, కిరణ్, సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మనోహర్‌రెడ్డి డిప్యూటి రీజినల్ మేనేజర్ భూపతిరెడ్డి, పర్సనల్ ఆఫీసర్ ఎంచంద్రయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు.

సూక్ష్మ కళలో నైపుణ్యం

- ప్రపంచ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో విష్ణుకు చోటు
- అవార్డులు, సత్కారాలు
- బాల్యం నుంచే సూక్ష్మ దృష్టి

కథలాపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బాల్యం నుంచి ఇంటి వద్ద ఇనుప పరికరాలను తన తండ్రి సానబెడుతూ సాగదీయడాన్ని శ్రద్ధగా గమనించిన ఆ యువకుడు 'సూక్ష్మ' దృష్టి సారించాడు. వ్యవసాయానికి పనికి వచ్చే రకరకాల పరికరాలను కాలుతున్న కొలిమిలో పదేపదే పరీక్షగాచూసి కొత్త ఆలోచనలకు ఊపిరి పోశాడు. తన అద్భుత తయారీ విధానంతో ఏకంగా వండర్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించాడు మండలంలోని తాండ్ర్యాలకు చెందిన బండెడ్ల విష్ణు.

- కొంగొత్త పరికరాల రూపకల్పన

తండ్రి స్వతహాగా కమ్మరి వృత్తిలో ఉండడంతో వస్తువుల తయారీ సులువుగా నేర్చుకున్న విష్ణు తనదైన శైలితో ఏదోరకంగా ప్రత్యేకత చాటుకోవాలని చిన్ననాటి నుంచే ఉత్సాహం కనబరిచాడు. అవకాశం కోసం ఎదురు చూస్తున్న క్రమంలో తండ్రి మరింత ప్రోత్సాహం అందించాడు. చదువు మానేసాక కుల వృత్తిలోనే స్థిరపడాలని నిర్ణయించుకుని కొలిమిలో ప్రయోగాలకు శ్రీకారం చుట్టాడు. గోరుపై ఇమిడే అతి చిన్న కొడవలి, గొడ్డలి, కురిపె, కొంక తయారు చేసి పలువురిని అబ్బురపరిచాడు. అగ్గిపెట్టెలో ఇమిడే వివిధ రకాల పరికరాలను రూపొందించాడు. సెంటీమీటర్ పొడవున్న అమర వీరుల స్తూపం, శివలింగం వంటివి తయారు చేశాడు. విష్ణు ప్రతిభను తెలుసుకున్న రాష్ట్ర కళా విభాగానికి చెందిన బృందం తాండ్ర్యాలకు వచ్చి స్వయంగా పరిశీలించింది. 2016లో తెలంగాణ రాష్ట్ర రికార్డుగా నమోదు చేసుకున్నారు. 2021లో ఇందిరాగాంధీ సద్భావన అవార్డు సొంతం చేసుకున్నాడు.


గోరుపై ఇమిడే గొడ్డలి, కొడవలి పరికరాలు


చిన్న సైజ్‌లో తయారుచేసిన ఎడ్లు, కచ్చురం

- నలుగురిలో ప్రత్యేకంగా ఉండాలనే..

తండ్రి వృత్తి రీత్యా కమ్మరి కావడం మూలాన వ్యవసాయానికి వినియోగించే పరికరాలను తయారు చేయడాన్ని దగ్గరి నుంచి చూశాను. ఒకరోజు మా నాన్న కొలిమిలో లేని సమయంలో చిన్న వస్తువులను తయారు చేశాను. అందరూ చూసి నన్ను మెచ్చుకున్నారు. అదే స్ఫూర్తిగా అనేక సూక్ష్మ వస్తువులను తయారు చేశాను.



- విష్ణు, కళాకారుడు

అకాల వర్షంతో వరి పంటకు నష్టం

- నేలవాలిన వరి పంట
- ఆందోళనలో అన్నదాతలు

ఇల్లందకుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పంట దెబ్బతిన్నది. మండలంలోని రైతులు సుమారు 7,800 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి మర్రివానిపల్లె, సిరిసేడు, ఇల్లందకుంట తదితర గ్రామాల్లోని వరి పంట నేలకొరిగింది. మర్రివానిపల్లె గ్రామంలో 65ఎకరాల్లో వరిపంట పూర్తిగా దెబ్బతిన్నది. విషయం తెలుసుకున్న వ్యవసాయ విస్తరణాధికారి మమత శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట నష్టం వివరాలను అంచనా వేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. కోతకు వచ్చిన పంట దెబ్బతినడంతో తీవ్ర నష్టం జరిగిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరారు.

వెల్గటూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆరు గాలం కష్ట పడి పండించిన వరి చేతికి వచ్చే సమయంలో నేల వాలడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో శుక్రవారం ఉదయం కురిసిన చిరు జల్లులకు గాలి తోడు కావడంతో చాలా చోట్ల వరి నేల వాలింది. అసలే సరియైన వర్షాలు లేక కష్ట పడి పండించిన పంటలను అకాల వర్షం రూపంలో నష్టం కలుగుతుందని రైతన్నలు వాపోతున్నారు.


మర్రివానిపల్లెలో నేలవాలిన వరి పొలాన్ని చూసి బోరున విలపిస్తున్న రైతు

సారంగాపూర్, నవవబరు, 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వర్షం కురువడంతో కోత కోతకు వచ్చిన వరి పొలాలు నేలకొరిగాయి. కొనుగోలు కేంద్రాల్లో ఆరగబోసిన ధాన్యం కుప్పల్లోకి వర్షం నీరు చేరడంతో రైతులు ఇబ్బందులుపడుతూ తమ ధాన్యం తడవకుండా కవర్లు కప్పుతూ తంటాలు పడ్డారు. ఇంకా కొన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. వెంటనే ప్రారంభించి కొనుగోళ్లు జరిపేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో..

సిరిసిల్ల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని విలీన గ్రామాల్లో శుక్రవారం కురిసిన అకాల వర్షంతో ధాన్యం తడిసిపోవడంతో అన్నదాతలు అందోళన చెందుతున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్, పెద్దూర్, పెద్దబోనాల, చిన్నబోనాల, ముష్టిపల్లి, చంద్రంపేట, రగుడు గ్రామాల్లోని రెండో బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. పెద్దూర్, చిన్నబోనాల గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని వార్డు కౌన్సిలర్లు బోల్గం నాగరాజుగౌడ్, లింగంపల్లి సత్యనారాయణ, పాతూరి రాజిరెడ్డి, పోచవేని సత్య ఎల్లయ్య, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎరవెల్లి వెంకటరమణారావు, పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్ పరిశీలించారు.

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన వరిధాన్యం వర్షానికి కోట్టుకు పోయింది. దీంతో సుమారు 50 క్వింటాళ్ల ఉంటుందని బాధిత రైతులు తెలిపారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండల రంగంపేటలో రైతులు తడిసి కొట్టుకుపోయిన ధాన్యాన్ని నీటినుంచి ఎత్తుకున్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్, సింగిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోనుగోలు కేంద్రాల్లోని ధాన్యం పూర్తిగా తడిసింది.


వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి వద్ద నేల వాలిన వరి పైరు


సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లిలో వర్షానికి తడిసిన ధాన్యం


సిరిసిల్ల చిన్నబోనాలలో అకాల వర్షానికి నెలకొరిగిన వరి పంట

మహిళ అదృశ్యం


స్వప్న(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం రేకుర్తి గ్రామానికి చెందిన నేరెళ్ళ స్వప్న(31) అనే అవివాహిత మహిళ అక్టోబరు 29వ తేదీనుంచి అదృశ్యమైందని ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. స్వప్న ఇంటి నుంచి బయటకు వెళ్లి రాపోకవడంతో ఫిర్యాదు చేశారని చెప్పారు. స్వప్నకు కొంత కాలం నుంచి మతి స్థిమితంగా లేదని తెలిపారు. గుర్తించినవారు కొత్తపల్లి పోలీసులకు 8712670765 నంబరుకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

చోరీ కేసులో ఇద్దరి రిమాండ్

- రూ.4.50లక్షల కాపర్ వైర్ స్వాధీనం


ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చూపుతున్న పోలీస్‌లు

జమ్మికుంట రూరల్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖకు సంబంధించిన ఐదు వందల కిలోల కాపర్ వైరు చోరీ కేసులో ఇద్దరి వ్యక్తులను పోలీస్‌లు అరెస్ట్ చేశారు. పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ చోరీ వివరాలను వెల్లడించారు. జమ్మికుంట పట్టణ పరిధిలోని దుర్గాకాలనీలో గల ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్ గోదాంలో రైల్వే శాఖకు సంబంధించిన జయంత్ ఇన్ఫ్రా కంపెనీకి చెందిన రూ.4.50లక్షల విలువ గల ఐదు వందల కిలోల కాపర్ వైరు నిల్వ చేశారు. ఎల్‌బీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ బండవత్ సందీప్, దేవరకొండ జిల్లాకు చెందిన బాలుతో కలిసి ఈనెల 29న గోదామ్ షెట్టర్ తాళాలు పగులగొట్టి ఐదు వందల కిలోల వైరు ఎత్తుకెళ్లారు. దొంగలించిన వైరును కీసర మండలం నాగారంకు చెందిన పాత సామన్లు కొనుగోలు చేసే హేమ కనుకయ్యకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. గోదామ్ ఇన్‌చార్జి జగదీష్‌దాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి చేసి దర్యాప్తు చేపట్టారు. 48గంటల వ్యవధిలో సందీప్, కనుకయ్యను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న వైరు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. కేసును త్వరగా ఛేదించిన ఎస్ఐ ఆరోగ్యం, హెడ్ కానిస్టేబుళ్లు మోహన్, సదయ్య, సంపత్, కానిస్టేబుల్ వేణు, సిబ్బందిని సీఐ అభినందించారు.

ఆలయంలో చోరీ

కోరుట్ల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామ శివారులోని గంగమ్మ దేవాలయంలో చోరీ జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామ శివారులోని ఆలయంలోకి భక్తులు శుక్రవారం ఉదయం వెళ్లగా ఆలయానికి వేసిన తాళం పగుల గోట్టి ఉండడంతో పాటు ఆలయంలోని వస్తువులు చిందరవందగా పడి ఉండడాన్ని భక్తులు గమనించి గ్రామస్థులకు సమాచారం అందించారు. ఆలయంలో గంగమ్మ తల్లిపై ఉన్న ఆర తులం బంగారు అభరణాలతో పాటు హుండీలో ఉన్న నగదు దోచుకపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. విషయంపై పోలీసులకు వివరణ అడుగగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు


నిందితుడి అరెస్ట్ చూపుతున్న మెట్‌పల్లి డిఎస్పీ

మెట్‌పల్లిటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలం వెంపల్లి గ్రామంలో గత నెల 30న భార్య సునీత(26)ను హత్య చేసిన భర్త రమేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్‌కు సంబంధించిన వివ రాలను మెట్‌పల్లి డీఎస్పీ ప్రెస్‌నోట్ ద్వారా వివరాలు రిలీజ్ చేశారు. మల్లాపూర్ మండలం వెంపల్లి గ్రామానికి చెందిన వెలుమల రమేష్‌కు 2015లో అల్లీపూర్ గ్రామానికి చెందిన సునీతతో వివాహం జరిగింది. వీ రికి కొడుకు, కూతురు ఉన్నారు. రమేష్ ఉపాధి నిమిత్తం దుబాయి వెళ్లిన రమేష్ నెల రోజుల క్రితం స్వగ్రామం వచ్చాడు. అప్పటి నుంచి దంపతుల మధ్య గొడవలు మొదలయ్యాయి. భార్య సునీత వివాహేతర సంబంధం పెట్టుకుందని చేయి చేసుకునేవాడు. అదే అనుమానంతో గత నెల 30న ఉదయం భార్యపై దాడి చేశాడు. అనంతరం గొంతు పిసికి హత్య చేశాడు. సునీత తండ్రి మందుల గంగారాజం ఫిర్యాదు మే రకు కేసు దర్యాప్తు చేస్తుండగా గత నెల 31న నిందితుడు ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీలో ఉన్నట్లు తెలియడంతో అక్కడకు కోరుట్ల సీఐ సురేష్ బాబు, మల్లాపూర్ ఎస్ఐ పబ్బ కిరణ్‌కుమార్ అక్కడకు వెళ్లి నిందితుడిని పట్టుకుని విచారించారు. భార్యను హత్య చేసి నట్లు నేరం ఒప్పు కోవడంతో అతడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన కోరుట్ల సీఐ, మల్లాపూర్ ఎస్ఐని డీఎస్పీ అభినందించారు.

జిల్లా కేంద్రంలో అగ్నిప్రమాదం

జగిత్యాల క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలోని కస్తూరి స్ట్రీట్‌లో గురువారం రాత్రి ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అమ్మాజీ డ్రెస్ మెటిరియల్‌తో పాటు మరో షాపులో ఒక్క సారిగా మంటలు చేలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తేవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదం దీపావళి పండుగ సందర్భంగా పేల్చిన టపాసుల నిప్పురవ్వతోనే ప్రమాదం జరిగిందని అమ్మాజీ డ్రెస్ మెటిరియల్ యజమాని ఆరోపించారు. రూ. 30 లక్షలకు పైగా డ్రెస్ మెటీరియల్‌తో పాటు ఫర్నీచర్ తదితర వస్తువుల ఆస్తి నష్టం జరిగిందని వివరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వృద్ధురాలిపై వీధి కుక్క దాడి

జగిత్యాల క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలోని చిలుకవాడలో గురువారం ఓ వృదురాలిపై వీధి కుక్క దాడి చేసి గాయపరిచింది. రాజవ్వ తన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో కుక్క దాడి చేయడంతో చేతికి, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మెట్‌పల్లిలో ఆవుల బీభత్సం..

- ఇద్దరికి గాయాలు

మెట్‌పల్లిటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ రోడ్ వాసవి టెంపుల్ ఎదురుగా రోడ్డుపై ఆవులు బీభత్సం సృష్టించాయి. మార్కెట్ రోడ్డులో రెండు ఆవుల కుస్తీకి దిగాయి దింతో అటు వైపు వెళ్తున్న వాహనాలకు ఆవులు తగలడంతో ఓ వాహనంపై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా మరో వ్యక్తి స్వల్ప గాయలయ్యాయి. ఆవులు కుస్తీకి దిగడంతో అక్కడ ఉన్న ప్రజలు భయందోళనకు గురయ్యారు. రోడ్లపై ఆవులు సంచరించకుండ అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

త్రికోటేశ్వరుడి సన్నిధిలో
జూనియర్ జడ్జిలు

నరసరావుపేట కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జూనియర్ సివిల్ న్యాయమూర్తులు శుక్రవారం పల్నాడు జిల్లా కోటప్పకొండపై త్రికోటేశ్వరుడిని దర్శించుకున్నారు. కరీంనగర్ సివిల్ న్యాయమూర్తి రాజేశ్వర్, గోదావరిఖని సివిల్ న్యాయమూర్తి సచిన్‌రెడ్డి, దేవరకొండ జూనియర్ సివిల్ న్యాయమూర్తి కేవీఎస్ హరీష్‌బాబు, భద్రాచలం సివిల్ న్యాయమూర్తి శివనాయక్, జడ్చర్ల సివిల్ న్యాయమూర్తి ముదాసీర్, నిజామాబాద్ సివిల్ న్యాయమూర్తి శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకున్నారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

ఎల్లారెడ్డిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో గురువారం దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయ తలుపులు ధ్వంసం చేసి లోనికి ప్రవేశించి అమ్మవారి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న ముదిరాజు సంఘం పెద్దల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ఎల్లారెడ్డిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొప్పాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ముత్యాల మనోజ్‌రెడ్డి జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-17 విభాగంలో వాలీబాల్ రాష్ట్ర స్థాయిలో పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చాడన్నారు. ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

దూరవిద్య డిగ్రీలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

జమ్మికుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 15 వరకు గడువు పొడిగించినట్లు జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించాలని సూచించారు.

డీఏ బకాయిలను చెల్లించాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లందరికీ డీఏ బకాయిలను ఒకే విడతలో చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రవీంద్రచారిలు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 17 విడతల్లో బకాయిలను చెల్లించడం దారుణమని, వాయిదాల పద్ధతిలోకి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లను నెట్టవద్దని కోరారు.


శిక్షణ పొందుతున్న ఉద్యోగార్థులు

ఉద్యోగార్థులకు అండగా..
ఎస్సీ స్టడీ సర్కిల్

జగిత్యాల పట్టణంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ నిరుద్యోగులకు అండగా నిలుస్తోంది. ఉచితంగా మెటీరియల్ అందించడంతో పాటు శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా, లక్ష్యానికి చేరువులో మెరుగైన శిక్షణ అందిస్తూ కొలువులు సాధించడంలో నిరుద్యోగులకు స్టడీ సర్కిల్ బాసటగా నిలుస్తోంది. విద్యార్థుల సౌకర్యార్థం డిజిటల్ లైబ్రరీ, గ్రంథాలయం అందుబాటులో కూడా ఉన్నాయి. ఎంపికైన విద్యార్థులకు శిక్షణ తో పాటు ఉచితంగా స్టడీ మెటీరియల్ లేదా రూ.2500 మెటీరియల్ కొనుగోలుకు అందిస్తున్నారు. శిక్షణ తీసుకున్న వారిలో ఇప్పటి వరకు సుమారు 50 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి స్థిరపడ్డారు.

- ఉచిత శిక్షణతో ఉద్యోగావకాశాలు
- నాలుగు బ్యాచ్‌లతో నాలుగువందల మందికి శిక్షణ
- పరీక్ష విధానం ద్వారా విద్యార్థుల ఎంపిక
- సకల వసతులు, మెరుగైన ఫలితాలతో సక్సెస్‌ఫుల్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణాలకు వెళ్లాల్సిన పనిలేదు, కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. కోచింగ్ ఫీజులు, పుస్తకాల కోసం జేబులు ఖాళీ చేసుకోవాల్సిన పరిస్థితి లేదు. ఉద్యోగం సాధించాలనే తపన, అందుకు తగ్గట్టుగా శ్రమ, సంకల్పం ఉంటే చాలు అభ్యర్థుల ఆశయాలకు అనుగుణంగా ఉచిత శిక్షణ అందిస్తోంది జగిత్యాల పట్టణంలోని బీట్ బజారులో గల ఎస్సీ స్టడీ సర్కిల్. సకల వసతులను ఉచితంగా కల్పిస్తూ, పోటీ ప్రపంచంలో పట్టణ, గ్రామీణ యువతను సమ ఉజ్జీలుగా నిలుపుతూ వారి ఉన్నత భవితకు బాటలు వేస్తున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో కొనసాగుతున్న కార్యక్రమాలు, విజయాలపై ప్రత్యేక కథనం...



తాత్కాలిక స్టడీ సర్కిల్ భవనం

● ఉద్యోగార్థులకు వెన్నుదన్నుగా...

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన స్టడీ సర్కిల్‌లు సత్ఫలితాలిస్తున్నాయి. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేస్తోంది. జిల్లా కేంద్రంలో 2020 జనవరిలో ఏర్పాటు చేసిన ఎస్సీ స్టడీ సర్కిల్ జిల్లాలోని నిరుద్యోగులకు వరంగా మారింది. ప్రారంభించిన నాటి నుంచి నాలుగు బ్యాచ్‌లకు శిక్షణ అందించారు. ఐదు నెలలకు ఒక బ్యాచ్ చొప్పున, వంద మందికి శిక్షణ అందించారు.

● నాలుగు బ్యాచ్‌లు, 53 కొలువులు

జిల్లా కేంద్రంలో ఉన్న ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా నాలుగు బ్యాచ్‌లకు గాను సుమారు 400మంది ఉద్యోగార్థులకు శిక్షణను అందించారు. ఇందులో 53మంది ఉద్యోగార్థులు కొలువులు సాధించారు. ఆర్ఆర్‌బీలో-01, ఎస్ఎస్‌సీ-01, పోలీసుశాఖలో-10, టీచర్ పోస్టులు-10, జూనియర్ అసిస్టెంట్-02, ఏఈ ఎలక్ట్రిసిటీ-01, జూనియర్ లెక్చరర్-02, డిగ్రీ లెక్చరర్-01, ఎల్ఐసీ డీవో-01, లైబ్రేరియన్-02, గురుకుల -03, కేజీబీవీలో-02 ఉద్యోగాలు సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు.

● ఉచితంగా మెటీరియల్ పంపిణీ

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ కోసం విద్యార్థులను పరీక్ష విధానం ద్వారా ఎంపిక చేస్తారు. ఎస్సీలకు 75శాతం, ఎస్టీలకు 10శాతం, బీసీ, మైనార్టీలకు కలిపి 15శాతం కేటాయిస్తూ, ఓరల్ రిజర్వేషన్‌లో 33శాతం మహిళలకు కేటాయిస్తూ ఈ ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. ఎంపికైన విద్యార్థులకు శిక్షణతో పాటు ఉచితంగా స్టడీ మెటీరియల్ లేదా రూ.2500 మెటీరియల్ కొనుగోలుకు అందిస్తారు.

మూడు ఉద్యోగాలు సాధించా
మంద మధుకర్, బీర్‌పూర్ మండలం తుంగూరు వాసి.

మాది బీర్‌పూర్ మండలం తుంగూరు గ్రామం. తండ్రి వ్యవసాయ కూలి, తల్లి బీడీ కార్మికురాలు. జగిత్యాల లోని బీట్‌బజార్‌లో గల స్టడీ సర్కిల్‌లో ఐదు నెలలు ఉచిత శిక్షణ పొందాను. ఈ శిక్షణ ద్వారా రైల్వే డీఎస్సీ-2024లో ఎస్టీటీ, గ్రూప్-4 లో మూడు ఉద్యోగాలు సాధించాను.



ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా
నరేష్ కుమార్, స్టడీ సర్కిల్ డైరెక్టర్, జగిత్యాల

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్టడీ సర్కిల్‌ను నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. శిక్షణ ద్వారా 53 మంది కొలువులు సాధించారు.



ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి
రాజ్‌కుమార్, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి, జగిత్యాల జిల్లా

స్టడీ సర్కిల్ ద్వారా అందిస్తున్న ఉచిత శిక్షణను ఉద్యోగార్థులు సద్వినియోగం చేసుకోవాలి. అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నాం. నవంబర్‌లో నూతన బ్యాచ్ ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల అవుతుంది. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని కొలువులు సాధించాలి.



పక్కా భవనం కోసం స్థల కేటాయింపు
సత్యప్రసాద్, జగిత్యాల కలెక్టర్

జగిత్యాలలో ఎస్సీ స్టడీ సర్కిల్ పక్కా భవన నిర్మాణానికి స్థలం కేటాయించాం. నిధులు కేటాయింపునకు ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అయిన తదుపరి భవనం నిర్మాణం చేసి, వసతులు కల్పిస్తాం. బ్యాచ్‌లు ప్రారంభం కాగానే క్రమం తప్పకుండా స్టడీ సర్కిల్‌ను సందర్శించి మౌలిక వసతులు కల్పిస్తాం.



రాజన్న క్షేత్రంలో దీపావళి వేడుకలు


అంబారీ సేవపై స్వామివారి ఉత్సవమూర్తుల ఊరేగింపు

వేములవాడ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో దీపావళి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు పూజలు చేశారు. రాత్రి స్వామివారి ఉత్సవమూర్తులను అంబారీ సేవపై ఊరేగించారు. సూపరింటెండెంట్‌లు నర్సయ్య, నరేందర్ పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న ఎస్పీ

వేములవాడ రాజరాజేశ్వర స్వామిని ఎస్పీ అఖిల్‌మహాజన్ దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన ఎస్పీకి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజ అనంతరం ఆలయం అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ సూపరింటెండెంట్ నర్సయ్య ప్రసాదాన్ని అందజేశారు.

భక్తులు రద్దీ.. : వేములవాడ రాజ రాజేశ్వరస్వామిని గురు, శుక్రవారాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ముందు భాగంలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు.

ధర్మపురిలో దీపాలంకరణ
ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ఆలయంలో దీపాలంకరణ

ధర్మపురి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దీపావళి పండుగ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. స్థానిక లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ దేవాలయాల్లో ఉదయం ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో ధన లక్ష్మీపూజలు జరిపారు. యాగ శాల వద్ద లోక క్షేమార్థం నిత్య హవనం కార్యక్రమాలు జరిపారు. రాత్రి ప్రధాన ఆలయంలో సహస్ర దీపాలంకరణ జరిపారు. ఆలయాల్లో స్వామి వారలను అందంగా పూలతో అలంకరించారు. స్థానిక మహాలక్ష్మీ ఆలయంలో కూడ దీపాలంకరణ చేశారు. సాయంత్రం స్వామి వారల సేవలను అశ్వ వాహనంపై పురవీధుల గుండా ఊరేగించారు. అంతకు ముందు గోదావరి నదిలో స్నానాలు ఆచరించిన భక్తులు అనంతరం స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


బంతిపూల తోట

బంతి సాగు.. భలే బాగు

- మూడపల్లిలో బంతిపూల సాగు చేస్తున్న యువ రైతు
- కూరగాయల స్థానంలో బంతిపూదోట

చందుర్తి నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయ పంటలతోపాటు సీజనల్ పంటల సాగు చేస్తున్నాడు చందుర్తి మండలం మూడపల్లికి చెందిన యువ రైతు గోలి శ్రీనివాస్. రాజన్న సిరిసిల్ల చందుర్తి మండలం మూడపల్లికి చెందిన శ్రీనివాస్ తనకు ఉన్న 3 ఎకరాల భూమిలో రెండు ఎకరాల్లో వరి, 30 గుంటల్లో బంతి పూలతోట, 10 గుంటల్లో కూరగాయల పంటలు సాగు చేస్తున్నాడు. పంట మార్పిడిలో భాగంగా సీజనల్ పంట సాగు కింద సుమారు 30 గుంటల విస్తీర్ణంలో బంతిపూల సాగు చేపట్టారు.

ఈ ఏడాది జూలైలో కరీంనగర్‌లోని నర్సరీలో సుమారు 2500 మొక్కలు కొనుగోలు చేసి తీసుకొచ్చి నాటాడు. మొక్కలు నాటేందుకు కూలీల ఖర్చు అంతా కలిపి రూ.14,000 వేల వరకు వచ్చింది. క్రిమి సంహారక మందులకు రూ.3000 వరకు ఖర్చయ్యింది. జూలైలో నాటగా బతుకమ్మ, దసరా పండుగల నాటికి మొదటిసారి సుమారు 3 క్వింటళ్ల దిగుబడి వచ్చిందని, కిలో రూ.100 విక్రయించానని రైతు తెలిపాడు. మొదటి పర్యాయంలోనే పంట పెట్టుబడి చేతికి వచ్చిందన్నాడు. డిసెంబరు చివరనాటికి ఇలా మూడు పర్యాయాలు పూలు దిగుబడి వస్తుందని, ప్రస్తుతం రెండోసారి పూలు కోయడానికి సిద్ధంగా తెలిపాడు. హోల్‌సేల్‌గా కాకుండా రిటైల్‌గా తోట వద్ద పూలకు గిరాకీ ఉంటుందని యువరైతు పేర్కొంటున్నాడు.

మొదటి ప్రయత్నంగా బంతి సాగు
గోలి శ్రీనివాస్, యువరైతు, మూడపల్లి

బంతి పూలు సాగు చేసిన 30 గంటల భూమిలో గతంలో కూర గాయలు సాగు చేశాం. పంట మార్పిడిలో బంతి పూలు సాగు చేద్దామనే ఆలోచన వచ్చింది. ఇందు లో భాగంగా మొదటి ప్రయత్నంలో బంతి పూల సాగు చేపట్టాం. కిలో బంతిపూలను రూ.80 నుంచి రూ.100 విక్రయిస్తున్నాం. పెద్ద పరిమాణంలో తీసుకుంటే హోల్‌సేల్ ధరకు అమ్ముతున్నాం. అన్ని ఖర్చులు పోను మూడు దిగుబడులకు కలిపి రూ.50 వేల వరకు లాభం వస్తుందని ఆశిస్తున్నాం.



రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక


జిగీష

సిరిసిల్ల టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థిని కే జిగీష రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైంది. శుక్రవారం శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ పల్లె రాజురెడ్డి, రైసింగ్ స్పోర్ట్స్ అకాడమీ కోచ్ కృష్ణ జిగీషను అభినందించారు. అక్టోబరు 29న ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన జిగీష రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. శనివారం నుంచి ఈ నెల 4వరకు ఆసిఫాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు నుంచి పాల్గొననుంది. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కులాలవారీగా లెక్కతేలితేనే
సమన్యాయం

- సర్వేకు సహకరించాలి
- తప్పుడు సమాచారమిస్తే కేసులు
- సమగ్ర సర్వే ఏమైందో దేవుడికే తెలియదు...
- చిత్తశుద్ధితో చేస్తున్న సర్వేతో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నా
- బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్



కమిషన్ ముందు మోకరిల్లి తన గోడును వెల్లబోసుకుంటున్న బీసీ సంఘం ప్రతినిధి కానుగంటి శ్రీనివాస్

కరీంనగర్ టౌన్/సుభాష్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా కులాలవారిగా లెక్కతేలితేనే సమన్యాయం జరుగుతుందని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల కలెక్టర్లు, అధికారుల సమక్షంలో బీసీ కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజల నుంచి అభ్యర్థనలు, సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో కులసంఘాలు, ఉప కుల సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు, వివిధ వర్గాలకు చెందిన ప్రతినిధులు బీసీ కమిషన్‌కు అభ్యర్థనలను, సూచనలను ఇచ్చి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు.

● వినతుల వెల్లువ

తాపీమేస్త్రీగా పనులు చేస్తూ సంచార జాతులుగా జీవిస్తున్న తమను బీసీ-డీ గ్రూపు నుంచి ఏ గ్రూపులో చేర్చాలని ఉప్పర సంఘం జిల్లా అధ్యక్షుడు కానుగంటి శ్రీనివాస్ కోరుతూ కమిషన్ ముందు మోకాళ్లపై కూర్చొని అభ్యర్థించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఇలా మోకరిల్లడ మేమిటి ఒకింత ఆగ్రహం వ్యక్తం చేస్తూనే న్యాయం జరిగేందుకు కృషిచేస్తామని చెప్పారు.

- రెండు లక్షల జనాభా కలిగిన గాండ్లతిల సంఘం కులవృత్తి గానుగపై నూనె తయారు చేయడం పూర్తిగా కనుమరుగైందని, ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, రెడ్డిగాండ్ల కులస్తులను తమ గ్రూపు నుంచి తొలగించాలని ఆ సంఘం అధ్యక్షుడు జక్కం సంపత్ కోరారు.
- ముస్లిం రిజర్వేషన్లను 4 నుంచి 12శాతానికి పెంచాలని, ముస్లిం సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని ముఫ్తీ గయాస్ కోరారు.
- విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలైన కమ్మరి, వడ్రంగి, కంచరం, శిల్పి, స్వర్ణకార వృత్తులవారిని ఆయా కులాలుగా పేర్కొంటున్నా రని, వారందరిని విశ్వ బ్రాహ్మణులు ఒకే కులంగా పరిగణించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరామోజు రవీంద్రాచారి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.
- నిర్మాణ రంగంలో పనిచేస్తూ జీవించే సగరఉప్పర కులస్తులను బీసీ-డి నుంచి 'ఏ'లోగానీ, ఎస్సీ, ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘ బాధ్యులు కోరారు.


కమిషన్ సభ్యులతో వాగ్వాదానికి దిగుతున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

- గంగపుత్రబెస్త కులాన్ని సంప్రదాయ మత్స్యకారులుగా గుర్తించాలని, ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా బీసీ నుంచి ఎస్సీల్లో చేర్చాలని ఆ సంఘం ప్రతినిధి మోసం అంజయ్య వినతిపత్రం అందించారు.
- ముస్లింలను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించాలని, నూర్‌బాషా ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసి దూదేకులకు ఆర్థికసహాయాన్ని అందించాలని దూదేకుల నూర్‌బాషా సంఘం అధ్యక్షుడు బాబుజానీ కోరారు.
- ముస్లింలలోని ఉప కులస్తుందరికీ 4శాతం రిజర్వేషన్ వర్తింపజేయాలని, ఆలయాలు, మసీదులపై దాడులు జరగకుండా కఠినచట్టాలను అమలులోకి తేవాలని, వక్ఫ్‌బోర్డు చట్టాన్ని సమర్థవంతంగా అమలయ్యేలా చూడాలని కాంగ్రెస్ మైనార్టీసెల్ అధ్యక్షుడు తాజొద్దీన్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.
- వక్ఫ్‌బోర్డు ఆస్తులను ఆక్రమిస్తున్నారని కలెక్టర్, తహసీల్దార్ కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకునేలా చూడాలని కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు సమద్‌నవాబ్ బీసీ కమిషన్‌ను కోరారు.
- ఎంఐఎం అధ్యక్షుడు గులాంఅహ్మద్ హుస్సేన్ ముస్లింలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.
- నీరాకేఫ్‌లు ఏర్పాటు చేయాలని గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్ళపల్లి శ్రీనివాస్‌గౌడ్ కోరారు.
- ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం ముదిరాజ్ దామాషా ప్రకారంగా బీసీ-డీ నుంచి బీసీ-ఏలో చేర్చాలని కోరారు. ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చవద్దని తెలంగాణ రజక సంఘం అధ్యక్షుడు పూసాల సంపత్‌రజక, శ్రీకాంత్ కోరారు. తమకు ఆర్థిక సహాయాన్ని అందించి స్వయం ఉపాధి కల్పించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఫకీర్ల సంఘం అధ్యక్షుడు కోరారు.

కోర్టు ఆదేశాలను గౌరవిస్తాం

గత ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ఎందుకు చేసిందో... ఆ వివరాలు ఎక్కడ ఉన్నాయో దేవుడికే తెలుసని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ అక్టోబరు 9న స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర కుటుంబ సర్వే వివరాలను అడిగితే అధికారుల నుంచి ఎలాంటి సమాధానం లేదన్నారు. ప్రస్తుతం చేపడుతున్న కుల గణన సర్వే ఓపెన్ సీక్రెట్ అని దాన్ని బహిర్గతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల ఖరారు విషయంలో ప్రత్యేక కమిషన్‌ను 15రోజుల్లో ఏర్పాటు చేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందనే సమాచార ముందని, అయితే దీనికి సంబంధించిన తీర్పు వివరాల ఆర్డర్ కాపీ మాకు ఇంకా అందలేదని తెలిపారు. కోర్టు ఉత్తర్వులను గౌరవిస్తామన్నారు. రాష్ట్ర అడ్వకేట్ జనరల్, న్యాయనిపుణుల సలహాల మేరకు కోర్టు ఉత్తర్వులను పాటిస్తూ ముందుగా ప్రకటించిన మేరకు ఈ నెల 13 వరకు బీసీ కమిషన్ పర్యటన కొనసాగుతుందని చెప్పారు. ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేని బీసీ కమిషన్ ఎవరికీ భయపడకుండా, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చిత్త శుద్ధితో నివేదిక ఇస్తుందన్నారు. ఈ సమావేశంలో బీసీ కమిషన్ సభ్యులు రాపోలు సత్యప్రకాశ్, రంగు బాలలక్ష్మి, తిరునగరి సురేందర్, కరీంనగర్, జగిత్యాల జిల్లాల కలెక్టర్లు పమేలా సత్పతి, సత్యప్రసాద్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



అభిప్రాయ సేకరణలో గందరగోళం

కరీంనగర్ టౌన్: బీసీ రిజర్వేషన్ల అభిప్రాయ సేకరణపై కాసేపు గందరగోళం నెలకొంది. అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి, కొత్తపల్లి మున్సిపల్‌చైర్మన్ రుద్ర రాజు తదితర నాయకులతో కలిసి బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులకు వినతిపత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందన్నారు. అయితే చట్ట ప్రకారం చెల్లుబాటుకాని పద్ధతిలో కుల గణన చేస్తున్నారని, 15 రోజుల్లో ప్రత్యేక బీసీ కమిషన్ ఏర్పాటు చేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసినా ఎందుకు ఈకార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తుందంటూ మాట్లాడటంతో సమావేశంలోని బీసీ సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు రాజకీయాలు ఎందుకు మాట్లాడుతున్నారంటూ పోడియం వద్దకు వచ్చి నిరసన తెలిపారు. దీనితో కొద్దిసేపు గందరగోళం నెల కొన్నది. వెంటనే కమిషన్ చైర్మన్ నిరంజన్ జోక్యం చేసుకొని నిరసన కారులు వెళ్లి తమ సీట్లలో కూర్చోవాలని, వారి అభిప్రాయాలను చెబుతున్నారని, అడ్డుకోవద్దంటూ సర్దిచెప్పారు. అయినప్పటికీ ఎమ్మెల్యే ఎంతసేపు రాజకీయాలు మాట్లాడతారంటూ ఆందోళన చేయగా పోలీసులు వారిని వెళ్ళగొట్టేందుకు ప్రయత్నించగా చైర్మన్ నిరంజన్ పోలీసులు అక్కడి నుంచి వెళ్లి పోవాలని, మీ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఆ తర్వాత జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కూడా మాట్లాడేందుకు ప్రయత్నించగా అనుమతించలేదు. ఈ సందర్భంగా సంజయ్, కౌశిక్ కొంత అసహనం వ్యక్తం చేసినప్పటికీ వారికి అనుమ తించక పోవడంతో వారు వేదిక నుంచి దిగి వెళ్లిపోయారు.

అంబరాన్నంటిన దీపావళి సంబరాలు

(5వ పేజీ తరువాయి)

తన నివాసంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు కుటుంబ సభ్యులు, డివిజన్, నగర వాసులతో వేడుకల్లో పాల్గొన్నారు. వంశపారంపర్య ఆచార సంప్రదాయాలను కాపాడుతూ భావి తరాలకు అందించడంలో భాగంగా దశాబ్ద కాలంగా ఉత్సవాలు శ్మశానంలో జరుపుకోవడం ఓ గొప్ప అనుభూతిగా భావిస్తున్నామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. రాబోయే దీపావళికి నిధులు కేటాయించి చెత్తా చెదారం తీసివేయించి అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. నగరంలోని 55వ డివిజన్‌లో కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. పలు డివిజన్‌లలో ఆయా డివిజన్ల నాయకులు, కార్పొరేటర్లు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

బీసీ కమిషన్ చైర్మన్‌కు మంత్రి పొన్నం స్వాగతం



బీసీ కమిషన్ చైర్మన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి

కరీంనగర్ అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఉమ్మడి జిల్లా పర్యటన సందర్భంగా శుక్రవారం కరీంనగర్‌కు చేరుకున్న బీసీ కమిషన్ చైర్మన్ గోనిశెట్టి నిరంజన్, కమిటీ సభ్యులు రాపోలు సత్యప్రకాశ్, రంగు బాలలక్ష్మి, తిరునగరి సురేందర్‌లకు రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతం పలికారు. బీసీ కమిషన్ చైర్మన్, కమిటీకి స్వాగతం పలికినవారిలో మంత్రితో పాటు కలెక్టర్ సమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్ ఉన్నారు. కరీంనగర్ రోడ్లు,భవనాల శాఖ అతిథిగృహంలో బీసీ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులను మంత్రి సన్మానించారు.

వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తాం

కరీంనగర్ అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ పట్టణంలోని వివిధ వ్యాపాసంఘాలతో మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం కరీంనగర్‌లోని రోడ్లు, భవనాలశాఖ అతిథిగృహంలో సమావేశం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యాపార సంఘాల ప్రతినిధులు లేవనెత్తిన పలు అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించిఅధి కారులతో మాట్లాడారు. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పొట్టి శ్రీరాములు పేరు తొలగింపు సరికాదు

కరీంనగర్ టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం సరికాదని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేస్తే బాగుండేదని ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. శుక్రవారం నగరంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు కలిసి అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించాలని, కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి కొమురవెల్లి వెంకటేశం, కోశాధి కారి పడకంటి శ్రీనివాస్, పొట్టి శ్రీరాములు ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల రామేశం, వైశ్య సంఘం అనుబంధ సంఘాల చైర్మన్లు రాచమల్ల భద్ర య్య, ప్రసాద్, రమేశ్,సాయికృష్ణ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

గంగుల కమలాకర్‌కు కేంద్ర మంత్రి పరామర్శ



గంగుల కమలాకర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న బండి సంజయ్

కరీంనగర్ టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి గంగుల కమలాకర్ మాతృమూర్తి గంగుల లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కమలాకర్, ఆయన సోదరులు వెంకన్న, సుధాకర్, ఇతర కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, పలువురు కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

హుజూరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ సమావేశంలో సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ప్రకటించడం హర్షదాయకమని, ఇది రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

వైరాగ్యం ప్రభాకర్‌కు సాహితీ సేవా రత్న పురస్కారం



పురస్కారం అందుకుంటున్న వైరాగ్యం ప్రభాకర్

కరీంనగర్ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, త్యాగరాయ గానసభలో బుధవారం మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహించిన వేడుకల్లో జిల్లా కేంద్రానికి చెందిన రచయిత, భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్‌కు సాహితీ సేవా రత్న పురస్కారాన్ని అందజేశారు. సంస్థ వ్యవస్థాపకుడు, గనులు భూగర్భ శాఖ రిటైర్డ్ డైరెక్టర్ విడి రాజగోపాల్, అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఏపీ మాజీ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ కొలకలూరి ఇనాక్, బిక్కి కృష్ణ చేతుల మీదుగా పురస్కారాన్ని స్వీకరించారు.

మహాశక్తి ఆలయంలో హవనం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహాశక్తి దేవాలయంలో దీపావళి సందర్భంగా శుక్రవారం లక్ష్మీ, కుబేర హవనం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాగ్దేవి క్లబ్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ

సుభాష్‌నగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వాగ్దేవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. దీపావళి పండగ సందర్భంగా స్థానిక అశోక్‌నగర్‌లోని వాసవీ దేవాలయం సమీపంలోని శక్తిసదన్‌లో చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి స్వల్ప గాయాలు

హుజూరాబాద్ రూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారులో బ్రిడ్జిపై లారీ బోల్తాపడిన ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరుగడంతో వరంగల్, కరీంనగర్ రహదారిపై పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఇందిరాగాంధీ సేవలు అభినందనీయం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- జిల్లా వ్యాప్తంగా వర్ధంతి వేడుకలు
- హాజరైన కాంగ్రెస్ నాయకులు



కరీంనగర్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

కరీంనగర్ అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దివంగత ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు అభినందనీయని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కరీంనగర్‌లోని ఇందిరా చౌక్‌లో గురువారం ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా డీసీసీ కార్యాలయం, ఇందిరాచౌక్‌లో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. మొదట డీసీసీ కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ ఇందిరాగాంధీ చిత్రపటానికి, ఇందిరాచౌక్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్ర మంలో వైద్యుల అంజన్ కుమార్, కోమటిరెడ్డి పద్మకర్‌రెడ్డి, ఎండీ తాజ్, పులి ఆంజనేయులు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ కరీంగనర్ మండల కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరాగాంధీ చిత్రపటాల వద్ద నివాళులు అర్పించారు. మండలంలోని దుర్శేడ్, గోపాల్‌పూర్ చౌరస్తాలో ఇందిరాగాంధి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ మండల ఇన్‌చార్జీ పురమల్ల శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, ఉపాధ్యక్షుడు కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం పలువురు నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: మానకొండూర్‌లో కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎన్ రవీంద్రాచారి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు రామిడి తిరుమల్‌రెడ్డి, గసిగంటి సంపత్, మడుపు ప్రేమ్‌కుమార్, గోపు రవీందర్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంతో పాటు సిరిసేడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వంగ రామకృష్ణ, ఇంగిలే రామారావు, బుర్ర రమేష్, రఫీ, సారంగపాణి, దేవేందర్, కుమార్, గోపాల్‌రెడ్డి, చిరంజీవి, మహేష్, తిరుపతిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, రాజబాబు, పరమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీణవంక: మండల కేంద్రంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నాయకులు పూమాలలు వేసి నివాళులు ఆర్పించారు. కార్యక్రమంలో నాయకులు గంగాడి రాజిరెడ్డి, చినాల ఐలయ్య, శ్రీపతిరెడ్డి, నల్ల కొండాల్‌రెడ్డి, సాహెబ్ హుస్సేన్, పైడి కుమార్, గూటం సమ్మిరెడ్డి, మద్దుల ప్రశాంత్, కర్ర తిరుపతిరెడ్డి, రషీద్, సలీం తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

'కులగణన'పై ప్రజలకు మంత్రి పొన్నం బహిరంగ లేఖ

కరీంనగర్ అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం రాష్ట్రంలో కులగణన సమగ్ర కులగణన చేపడుతున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రజలకు ఒక బహిరంగ లేఖను విడుదల చేశారు. కామారెడ్డిలో 2023 నవంబరు 10న జరిగిన కాంగ్రెస్‌పార్టీ బహిరంగ సభలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధిరామయ్య సమక్షంలో కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటప్రకారం బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించిందని, దానికి కట్టుబడి 2024 ఫిబ్రవరి 4న రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలో ఇంటింటికి సమగ్ర సర్వే(సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీచ, కులాల) కులగణను చేపట్టాలని తీర్మానించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల, ఎస్సీ, ఎస్టీ పౌరులు, ఇతర బలహీనవర్గాల అభ్యున్నతి కోసం వివిధ సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ అవకాశాలపై ప్రణాళిక రూపొందించి అమలు చేసేందుకు ఫిబ్రవరి 16న అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానించిందని తెలిపారు. ఈ తీర్మాణంకు అనుగుణంగా జీవో ఎంఎస్ నంబరు 26(15-3-2024) ప్రకారం కులగణన చేసేందుకు బీసీ సంక్షేమశాఖ ద్వారా 150 కోట్లు విడుదల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. కులగణను కోసం బీసీ కమిషన్ చైర్మన్‌గా నిరంజన్, కమిటీ సభ్యులను ప్రభుత్వం నియిమించిందని తెలిపారు. కులగణను చేసేందుకు ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌ను నోడల్ డిపార్ట్‌మెంట్‌గా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసిందని మంత్రి తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి 85 వేల మంది ఎన్యూమరేటర్లు, ప్రతి 10 మంది ఎన్యూమరేటర్లకు ఒక పరిశీలకుడుగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారుల సమక్షంలో ఇంటింటికీ వెళ్లి సమాచారం సేకరిస్తారని తెలిపారు. డాటా ఎంట్రీ చేయడంతోపాటు 30 నవంబరులోపు ఈ సమాచార సేకరణ పూర్తి చేయాలనే ప్రణాళికతో ముందుకుసాగుతున్న ప్రజలంతా సహకరించాలని మంత్రి కోరారు.

సమ్మేళనానికి తరలిరావాలి

సుభాష్‌నగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మాల, మాల ఉపకులాల ఐక్యత అభివృద్ధి సమ్మేళనానికి తరలిరావాలని సమ్మేళనం కన్వీనర్ ఈసరి జనార్దన్, సలహాదారుడు కొరివి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. నగరంలో శుక్రవారం సమ్మేళనం కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేడి రాజవీరు, అర్ష మల్లేశం, గంట శ్రీనివాస్, మేడి మహేశ్, దామెర సత్యం, కాడే శంకర్, తాళ్ళ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: కరీంనగర్‌లో ఆదివారం నిర్వహించే మాలల ఐక్యత అభివృద్ధి సమావేశం కరపత్రాన్ని శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సొల్లు బాబు, సతీష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: కరీంనగర్‌లో నిర్వహించే మాలల ఐక్యత అభివృద్ధి సమావేశ కరపత్రాన్ని గంగాధరలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మేడి అంజయ్యఆవిష్కరించారు.

చొప్పదండి: మాలమహానాడు ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను చొప్పదండిలో సంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఇంద్రయ్య, మాలల ఐక్యత సమ్మేళ సభ కన్వీనర్ గంట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి



వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

కరీంనగర్ క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్క రించుకుని గురువారం పోలీస్‌కమిషనరేట్ కేంద్రంలో వేడుకలను నిర్వహించారు. అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ దూరదృష్టి, చర్యల ద్వారా దేశ ఐక్యత సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ జానిమియా, శ్రీధర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భగత్‌నగర్: వల్లభాయ్ జయంతి వేడుకలు జయంత్యుత్సవ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో రేకుర్తి సహజ కళాశాల, ఢిల్లీ డిఫెన్స్ కళాశాల పరిధిలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. రేకుర్తి-కొత్తపల్లి రహదారికి సర్దార్ పటేల్‌మార్గ్‌గా నామకరణం చేశారు. పటేల్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమితి నిర్వాహకుడు బండ గోపాల్‌రెడ్డి, బాధ్యులు నాగమల్ల సురేష్, ఢిల్లీ డిఫెన్స్ కళాశాల చైర్మన్ సతీష్‌రెడ్డి, పసుల సురేష్, తొర్తి శ్రీనివాస్, నక్క ప్రమోద్, న్యాయవాదులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నాయకులు రాములకుమార్, కొండ లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చైతన్యరెడ్డి, గొపగాని సమ్మె, బేతి తిరుపతిరెడ్డి, తాళ్లపెల్లి అనిల్, కోటి, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు



సింగాపూర్‌లో బాణాసంచా కాలుస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో దీపావళి వేడుకలను గురు వారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమ ఇళ్లల్లో, వ్యాపార సముదాయాల్లో లక్ష్మీ పూజలు నిర్వహించారు. ఇళ్లను విద్యుత్ బల్బులు, దీపాలతో అలంకరించారు. నూతన వస్త్రాలను ధరించి పూజలలో పాల్గొన్నారు. తమ ఇళ్ల ముందు ప్రమీదలను వెలిగించారు. టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండల వ్యాప్తంగా దీపావళి వేడుకలు గురువారం అంబరాన్నంటాయి. సింగాపూర్ గ్రామంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ తన నివాస గృహంలో కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలను జరుపుకున్నారు.

శంకరపట్నం: మండలంలో దీపావళి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి మహిళలు, యువకులు, విద్యార్థులు నూతన వస్త్రాలు ధరించి ఆలయాల్లో పూజలు చేశారు.

మానకొండూర్: మండలం వ్యాప్తంగా దీపా వళి సందర్భంగా ప్రజలు లక్ష్మీ పూజలు, కేదారీ వ్రతం చేశారు. యువతీ, యువకులు, పిల్లలు టపాసులు కాల్చుతూ సందడి చేశారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో కేదారేశ్వరస్వామి నోములు, వ్రతాలు నిర్వహించారు. చిన్నపెద్దలు టపాసులు కాల్చి వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు.

సైదాపూర్: ప్రజలు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు.

కరీంనగర్‌రూరల్: నగునూరు ఎస్‌పీఆర్ స్కూలులో దీపావళి వేడుకలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

వీణవంక: మండలంలో దీపావళి వేడుకలు నిర్వహించారు ఇళ్లు, దుకాణాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రామడుగు: మండల వ్యాప్తంగా ప్రజలు తమ ఇంటి ముందు దీపాలతో అలంకరించారు. ఇళ్లల్లో ప్రత్యేక పూజలు చేశారు.

చిగురుమామిడి: మండలంలో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్మంలో మాజీ ఎంపిపి కొత్త వినీత-శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ 6వతేదీతో ముగియనున్నందున వెంటనే పట్టభద్రులంతా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ కోరారు. శుక్రవారం నగరంలో పలువురు మాజీ కార్పొరేటర్లు వారి డివిజన్లలో పట్టభద్రుల నుంచి స్వీకరించిన నమోదు పత్రాలను రవీందర్‌సింగ్‌కు అందజేసి వారందరి పేర్లను ఓటరు జాబితాలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఎడ్ల అశోక్, సాదవేని శ్రీనివాస్, నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కొత్తకొండ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మాటా ముచ్చట కార్యక్రమం

హుజూరాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించే పౌర సమాజంతో కోదండరామ్ మాటా ముచ్చట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీజేఎస్, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు శుక్రవారం పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీగా నియామకమై మొదటిసారిగా హుజూరాబాద్‌కు వస్తున్న సందర్భంగా టీజేఎస్, పౌర, ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పౌర సమాజంతో కోదండరాం మాటా ముచ్చట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీజేఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ ముక్కెర రాజు, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోతున్న ధాన్యం



ఇరుకుల్ల కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

కరీంనగర్ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం త్వరగా కాంటా వేసేందుకు సిబ్బంది చర్యలు తీసుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసిన రైతులు ఇళ్లకు వెళ్లిన అనంతరం రాత్రి సమయంలో దొంగలు చేతి వాటం ప్రదర్శిస్తున్నారని రైతులు చెబుతున్నారు. సోమవారం అర్ధరాత్రి కరీంనగర్ మండలం ఇరుకుల్ల గ్రామంలోని కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం దొంగిలించారని కాసు రాజు, ఎగుర్ల కనుకయ్య, తిరుపతి, బలుసుల తిరుపతి వాపోయారు. అధికారులు ఎప్పటికప్పుడు ధాన్యం కాంటా వేసేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కుటుంబ సర్వే ప్రారంభం



బొమ్మకల్‌లో స్టిక్కర్లు వేస్తున్న సిబ్బంది

కరీంనగర్ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. మండలంలోని బొమ్మకల్ గ్రామంలో సర్వే బాధ్యతలు చేపట్టిన మున్సిపల్‌కు అప్పగించగా మిగితా 16 గ్రామాల్లో సర్వే నిర్వహించేందుకు 56 మంది ఎన్యుమరేటర్లు, ఆరుగురు సూపర్‌వైజర్లను నియమించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్యుమరేటర్లకు సర్వే సామగ్రిని పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 12,210 కుటుంబాలు ఉన్నాయి. ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150 నుంచి 175 కుటుంబాలు కేటాయించారు. మధ్యాహ్నం నుంచి ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన వార్డులోని కుటుం బాలను గుర్తించి స్టిక్కర్లు అంటించారు. ఈనెల 30 వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. 6 నుంచి సమగ్ర సర్వేను ప్రారంభించనున్నారు.

ఇల్లందకుంట: మండలంలో ఈ నెల 6నుంచి 18వరకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి కరుణాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సమగ్ర ఇంటిం టి కుటుంబ సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్స్ స్టిక్కర్లు అతికించారు.

న్యూస్ బాక్స్

రాష్ట్ర స్థాయి ఉషు పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్యజ్యోతి): పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా లో శనివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే 68వ రాష్ట్రస్థాయి పాఠశాలల, కళాశాలల అండర్-17, 19 ఉషు పోటీలకు జిల్లాలోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. విద్యార్థులను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి తదితరులు అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్యజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 29న కొత్తపల్లిలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన సబ్ జూనియర్ జిల్లా స్థాయి బాలికల ఎంపిక పోటీల్లో కోరా జాన్సన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థుల ను, పీఈటీ దుర్గరాజును పాఠశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్ రెడ్డి అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'పారమిత' విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 1(ఆంధ్యజ్యోతి): ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడల్లో పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గోపికృష్ణ తెలిపారు. శనివారం నుంచి సోమవారం వరకు మహబూబాబాద్‌లో తెలంగాణ పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న 68వ ఎస్‌జీఎఫ్ అండర్-17 బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జి శ్రేష్ట, ఎం శ్రీతేజ ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ తోపాటు విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్‌రావు, వినోద్‌రావు, వీయుఎం ప్రసాద్, రమణ, హన్మంత రావు, సమన్వయకర్తలు నాగరాజు, రాము భవాని, పీఈటీలు రాజు మహేష్, సాజన్, అమరేందర్ తదితరులు అభినందించారు.

తిమ్మాపూర్(మానకొండూర్) నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన అలుగునూర్‌లోని పారమిత వరల్డ్ స్కూల్ విద్యార్థులు ఎ సంజయ్‌రెడ్డి, బి వైష్ణవి ని శుక్రవారం పలువురు అభినందించారు. 68వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. హైదరాబాద్‌లో నవంబరు 2 నుంచి 4 వరకు నిర్వహించే పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని పాఠశాల చైర్మన్ ప్రసాదరావు, ఉపాధ్యాయులు తెలిపారు.

విద్యార్థికి అభినందన

తిమ్మాపూర్(మానకొండూర్) నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ జట్టుకు ఎంపికైన ఎస్సార్ కళాశాల విద్యార్థి దాసరి రిషిని శుక్రవారం పలువురు అభినందించారు. అక్టోబరు 29న జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో రిషి ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. నవంబరు 2 నుంచి 4 వరకు వరంగల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడని కళాశాల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి తిరుపతి తెలిపారు.

యువత ఉద్యమించాలి

గంగాధర, నవంబరు 1(ఆంధ్ర జ్యోతి): ఉద్యోగ నియామకాల కోసం యువత ఉద్యమించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి అన్నారు. డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు.

జెండా ఎగురవేత

శంకరపట్నం, నవంబరు 1 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలో గురువారం ఏఐటీయూసీ ఆవిర్భావ సందర్భంగా జిల్లా కార్యదర్శి పిట్టల సమ్మయ్య ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సదానందం, రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.